# కరెంట్ అఫైర్స్

## సుప్రీంకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు

★ సుప్రీంకోర్టుకు నలుగురు న్యాయమూర్తులను నియమించాలంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని కొలీజియం 2018, అక్టోబరు 30న కేంద్రానికి సిఫారసు చేసింది. దీనికి ఆమోదం తెలిపిన కేంద్రం 2018, నవంబరు 1న నాలుగు వేర్వేరు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు సుప్రీంకోర్టు జడ్జిలుగా పదోన్నతి కల్పించింది.

★ గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఆర్.షా, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హేమంత్ గుప్తా, త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి పొందారు. వీరు 2018, నవంబరు 2న సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

★ ఈ నలుగురితో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 28కి చేరింది. మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 31.

## జీఎస్టీ వసూళ్లు రూ.1,00,710 కోట్లు

★ 2018, నవంబరు 1న ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2018, అక్టోబరులో రూ. 1,00,710 కోట్ల జీఎస్టీ వసూళ్లు జరిగాయి. వస్తు సేవల పన్ను వసూళ్లు అయిదు నెలల తర్వాత మళ్లీ లక్ష కోట్లు దాటాయి.

★ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సగటున నెలకు లక్ష కోట్ల జీఎస్టీ వసూళ్లు జరగాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. అయితే ఒక్క ఏప్రిల్ మినహా ఏ నెలలోనూ లక్ష కోట్లు వసూలు కాలేదు. మేలో ఈ వసూళ్లు రూ. 94,016 కోట్లు; జూన్‌లో రూ. 95,610 కోట్లు; జులైలో రూ. 96,483 కోట్లు; ఆగస్టులో రూ. 93,960 కోట్లు, సెప్టెంబరులో రూ. 94,442 కోట్లుగా నమోదయ్యాయి.

★ అక్టోబరులో వసూలైన లక్ష కోట్ల రూపాయల్లో సెంట్రల్ జీఎస్టీ రూ. 16,464 కోట్లు, స్టేట్ జీఎస్‌టీ రూ. 22, 826 కోట్లు, సమీకృత జీఎస్‌టీ రూ. 53,419 కోట్లు, సెస్ కింద మరో రూ. 8 వేల కోట్లు ఉన్నాయి.

## సులభతర వ్యాపారంలో మరింత పైకి

★ 2018, అక్టోబరు 31న ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన 'డూయింగ్ బిజినెస్ – 2019' నివేదికలో భారత్ 77వ ర్యాంకు సాధించింది. ప్రపంచవ్యాప్తంగా 190 దేశాల్లోని పరిస్థితులను పది పరిమితుల ఆధారంగా అంచనా వేసి ప్రపంచ బ్యాంకు ఈ ర్యాంకును ప్రకటించింది. గతేడాది 100వ ర్యాంకులో ఉన్న భారత్ ఏకంగా 23 ర్యాంకుల్ని అధిగమించి 77కు చేరుకుంది.

★ మోదీ సర్కారు 2014లో కేంద్రంలో కొలువుతీరే నాటికి ప్రపంచ బ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (సులభతర వ్యాపార విధానాలు) ర్యాంకుల్లో 142వ స్థానంలో ఉంది.

★ 190 దేశాల తాజా నివేదికలో వ్యాపార సులభతర విషయంలో న్యూజిలాండ్ తొలి స్థానంలో నిలిచింది. సింగపూర్, డెన్మార్క్, హాంకాంగ్ వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అమెరికా 8, చైనా 46, పాకిస్థాన్ 136వ స్థానాల్లో నిలిచాయి.

## రిటైర్ అయిన నాసా కెప్లర్ టెలిస్కోప్

★ దాదాపు దశాబ్దంపాటు సౌర కుటుంబం వెలుపల, ఇతర నక్షత్రాల చుట్టూ తిరుగుతున్న గ్రహాలను పసిగట్టిన కెప్లర్ అంతరిక్ష టెలిస్కోప్ శకం ముగిసింది. విశ్వంలో మరిన్ని పరిశీలనలు సాగించేందుకు అవసరమైన ఇంధనం ఇందులో లేకపోవడంతో దీని సేవలకు స్వస్తి పలకాలని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా 2018, అక్టోబరు 31న నిర్ణయించింది.

★ కెప్లర్ టెలిస్కోప్‌ను 2009, మార్చి 6న నాసా ప్రయోగించింది. సిగ్నస్ తారా మండలంలోని 1.5 లక్షల నక్షత్రాలను నిరంతరంగా పరిశీలించి, వాటి చుట్టూ తిరుగుతున్న గ్రహాలను పసిగట్టడం దీని ఉద్దేశం. కెప్లర్ తన ప్రస్థానంలో 2,600కు పైగా ఎక్సోప్లానెట్లను గుర్తించింది. అందులో జీవులకు ఆవాసయోగ్యమైనవి కూడా ఉన్నాయి.

## పటాకులపై తీర్పు సవరణ

★ దీపావళితోపాటు ఇతర పండుగలు, వేడుకల్లో రాత్రి 8 నుంచి 10 గంటల మధ్య రెండు గంటలు మాత్రమే పటాకులు కాల్చాలని ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు 2018, అక్టోబరు 30న సడలించింది.

★ వివిధ రాష్ట్రాల్లోని పరిస్థితులకు అనుగుణంగా అధికారులు పటాకులు కాల్చే సమయాన్ని మార్చవచ్చని, అయితే రోజుకు రెండు గంటలు మాత్రమే కాల్చాలన్న పరిమితి మాత్రం కొనసాగుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## ఆసియా హాకీ ఛాంపియన్స్ ట్రోఫీ-2018

★ ఆసియా హాకీ ఛాంపియన్స్ ట్రోఫీ - 2018ని భారత్, పాకిస్థాన్‌లు సంయుక్తంగా గెలుచుకున్నాయి. అక్టోబరు 28న మస్కట్‌లో జరగాల్సిన ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో రెండు జట్లు ట్రోఫీని పంచుకున్నాయి.

★ 3, 4 స్థానాల్లో జపాన్, మలేషియాలు నిలిచాయి. ఈ టోర్నీలో భారత్ జట్టు కెప్టెన్‌గా మన్‌ప్రీత్‌సింగ్ వ్యవహరించారు.

## ఇండోనేషియా విమాన ప్రమాదం

★ 2018, అక్టోబరు 29న ఇండోనేషియాకు చెందిన 'లయన్ ఎయిర్' విమానం 'ఫ్లైట్ జేటీ 610' జకార్తా విమానాశ్రయం నుంచి బయలుదేరిన 13 నిమిషాలకే జావా సముద్రంలో కూలిపోయింది. ఈ ఘటనలో విమానంలోని మొత్తం 189 మంది జలసమాధి అయ్యారు.

## ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో ద్రవిడ్

★ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్న భారత దిగ్గజ బ్యాట్స్‌మన్, మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్‌కు 2018, నవంబరు 1న ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేమ్ ట్రోఫీని తిరువనంతపురంలో మరో దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ ప్రదానం చేశారు. భారత్ - వెస్టిండీస్ అయిదో వన్డే ఆరంభానికి ముందు తిరువనంతపురంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

★ భారత్ నుంచి ఈ గౌరవం దక్కించుకున్న అయిదో ఆటగాడు ద్రవిడ్. అతడి కంటే ముందు భారత్ నుంచి బిషన్ సింగ్ బేడీ (2009), సునీల్ గవాస్కర్ (2009), కపిల్‌దేవ్ (2009), అనిల్ కుంబ్లే (2015) లకు మాత్రమే ఈ గౌరవం దక్కింది.

★ రాహుల్ ద్రవిడ్ 164 టెస్టులు ఆడి 13,288 పరుగులు, 344 వన్డేలు ఆడి 10,889 పరుగులు చేశాడు. 36 టెస్టు సెంచరీలు, 12 వన్డే సెంచరీలు నమోదు చేశాడు.

★ 2018 సంవత్సరానికి అంతర్జాతీయ క్రికెట్ మండలి జులై 1న రాహుల్ ద్రవిడ్‌తో పాటు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్, ఇంగ్లండ్ మాజీ మహిళా క్రికెటర్ క్లైయిర్ టేలర్‌లను హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చింది.

## ప్రధాని మోదీ జపాన్ పర్యటన

★ ప్రధాని నరేంద్ర మోదీ 2018, అక్టోబరు 28, 29 తేదీల్లో జపాన్‌లో పర్యటించారు.

★ టోక్యోలో జరిగిన '13వ భారత్ - జపాన్ భాగస్వామ్య సదస్సు'లో మోదీ ప్రసంగించారు. పర్యటన సందర్భంగా యోగా, ఆయుర్వేదంలో సహకారాన్ని పెంపొందించుకునే ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. విదేశీ మారక ద్రవ్యం పరంగా క్యాపిటల్ మార్కెట్లలో స్థిరత్వం కోసం స్థానిక కరెన్సీలో 7,500 కోట్ల డాలర్ల వరకు చెల్లింపులు చేసేందుకు వీలు కల్పించే భారీ స్థాయి ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి.

## స్టాచ్యూ ఆఫ్ యూనిటీ

★ సమైక్య భారత నిర్మాత, స్వతంత్ర భారత తొలి ఉప ప్రధాని, తొలి హోం మంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 143వ జయంతి సందర్భంగా ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 182 మీటర్ల (597 అడుగులు) సర్దార్ పటేల్ విగ్రహాన్ని 2018, అక్టోబరు 31న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవిష్కరించి జాతికి అంకితం చేశారు.

★ నర్మదా నది తీరాన కేవడియా వద్ద సాధుబెట్ దీవిలోని ఈ విగ్రహానికి 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' అని నామకరణం చేశారు.

**ఐక్యతా విగ్రహం విశేషాలు...**

★ విగ్రహ నిర్మాణ ప్రదేశమైన సాధుబెట్ ఐలాండ్ సర్దార్ సరోవర్ డ్యాంకు 3.5 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ డ్యాం ఇప్పటికే పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందింది. ఇది ప్రపంచంలోనే అత్యంత కాంక్రీట్ వాడిన రెండో డ్యాం. ఇది 1210 మీ. పొడవైన కాంక్రీట్ గ్రావిటీ డ్యాం. 121 మీ. ఎత్తున ఉంది. విగ్రహ నిర్మాణ వ్యయం రూ. 2,989 కోట్లు. ఈ విగ్రహ ప్రాజెక్టు మొత్తం పరిధి 19,700 చ.మీ.

- ★ పర్యాటకులు సమీపంలోని ప్రకృతి అందాలను చూసేందుకు విగ్రహం లోపల 135 మీటర్ల ఎత్తులో గ్యాలరీ ఏర్పాటు చేశారు.
- ★ నాలుగు అంచెల్లో విగ్రహాన్ని నిర్మించారు. త్రీ డైమెన్షనల్ స్కానింగ్ టెక్నిక్, కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ ప్రొడక్షన్ టెక్నిక్‌లను ఉపయోగించారు. టర్నర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రధాన నిర్మాణదారుగా ఈ ప్రాజెక్టులో పాలుపంచుకుంది. దీనికి మెయిన్‌హార్డ్, మైఖేల్‌గ్రేవ్స్, ఎల్ అండ్ టీ సంస్థలు సహకరించాయి. స్ట్రక్చర్ డిజైన్, ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్, కాంక్రీట్ నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను ఎల్ అండ్ టీ చేపట్టింది. రికార్డు స్థాయిలో 33 నెలల్లో విగ్రహ నిర్మాణాన్ని పూర్తిచేశారు. దీని నిర్మాణం కోసం దేశంలోని లక్షా అరవై తొమ్మిది వేల గ్రామాల నుంచి ఇనుమును సేకరించారు.
- ★ 3 వేల పటేల్ ఫొటోలను పరిశీలించి 1949లో తీసిన ఫొటో ఆధారంగా విగ్రహాన్ని రూపొందించారు.
- ★ 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' తర్వాత ప్రపంచంలో రెండో అత్యంత ఎత్తయిన విగ్రహంగా చైనాలోని స్ప్రింగ్ టెంపుల్ బుద్ధ విగ్రహం (153 మీ.) నిలిచింది.
- ★ విగ్రహ నిర్మాణంలో శిల్పి రామ్‌వంజి సుతార్ ప్రధాన భూమిక పోషించారు.

**రచయిత: సీహెచ్. కృష్ణ ప్రసాద్**

www.eenadupratibha.net
www.eenadupratibha.net